


# కరపత్రం

SINCE 2014

సోమవారం మార్చి 24 2025 | సంపుటి :0 | సంచిక : 161 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



హైదరాబాద్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ, దేవస్థానం అర్చకులు ఆహ్వానించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును మంత్రి కొండా సురేఖ ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ సహా ఇతర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని ఈ సందర్భంగా అధికారుల్ని ఆదేశించారు.

## నకిలీ పోలీసుల దారి దోపిడీ.. యువకుడిని నమ్మించి రూ.ఐదు లక్షలతో పరారీ!




మిగతాది 2లో

సికింద్రాబాద్ సమీపంలోని బోయిన్‌పల్లిలో నకిలీ పోలీసులు దారి దోపిడీకి పాల్పడ్డారు.

## కమ్యూనిస్టులంతా ఒకే ఎర్రజెండాగా మారాలి: సినీనటుడు అజయ్ ఘోష్

ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ అధికారంలోకి వస్తున్నాయి.. కానీ, భారత్‌లో పుట్టిన కమ్యూనిస్టు పార్టీ మాత్రం అధికారంలోకి రావడంలేదని ప్రముఖ సినీనటుడు అజయ్ ఘోష్ అన్నారు.



మిగతాది 2లో

## బండి సంజయ్‌కి అదొక్కటే తెలుసు.. ఇంకేం తెల్వదు

కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసిందేం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అయోధ్య తలంబ్రాల పేరుతోటి రేషన్ బియ్యం పంచి మొన్న ఎలక్షన్‌లల్ల ఒక్కసారి గెలిచిండని ఎద్దేవా చేశారు. కరీంనగర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న సెంటిమెంటు పూసి మాయ జేసిండు తప్పితే.. తెలంగాణల వాళ్ల ఆటలు ఎన్నడూ సాగలే అన్నారు.

మిగతాది 2లో




2 లో

## ఆర్టీసీ బస్సు-కారు ఢీకొని ప్రమాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

చివ్వెంల: సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద చోటుచేసుకుంది.

## హుటాహుటిన ఢిల్లీకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పయనం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు.

నిన్న చెన్నైలో జరిగిన సదస్సుపై తీవ్ర విమర్శలు.
కాంగ్రెస్, భారాస పాత బంధం బయటపడిందని ఆరోపణలు.
డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, భారాస అసత్య ప్రచారం చేస్తున్నాయన్న విమర్శ.
డీలిమిటేషన్‌పై కేంద్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం.

మిగతాది 2లో



## పోరాటాల పురిటిగడ్డ ఈ కరీంనగర్ గడ్డ

కరీంనగర్ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గారికి కరీంనగర్ జిల్లా అంటే సెంటిమెంటని, కరీంనగర్ నుంచి ఏ పని మొదలుపెట్టినా విజయవంతం అయితది అనే విశ్వాసం కేసీఆర్ గారికి ఉన్నదని, కాబట్టే పార్టీ పెట్టిన తర్వాత మొదటి బహిరంగ సభ సింహగర్జన 2001 మే 17న ఎస్ఆర్ఆర్ కాలేజీలో పెట్టారని కేటీఆర్ చెప్పారు.

నాడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ కరీంనగర్ గడ్డ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మిగతాది 2లో



జిల్లా అంటే సెంటిమెంటని, కరీంనగర్ నుంచి ఏ పని మొదలుపెట్టినా విజయవంతం అయితది అనే విశ్వాసం కేసీఆర్ గారికి ఉన్నదని, కాబట్టే పార్టీ పెట్టిన తర్వాత మొదటి బహిరంగ సభ సింహగర్జన 2001 మే 17న ఎస్ఆర్ఆర్ కాలేజీలో పెట్టారని కేటీఆర్ చెప్పారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 40 వేలు అందించాలి

మహబూబ్‌నగర్ : వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగానికి ప్రతి ఎకరాకు రూ. 40వేలు ఆర్థిక సహాయం అందించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబ్ నగర్ మండల పరిధిలోని బొక్కలోని పల్లి, రామచంద్రపూర్, తెలుగు గూడెం, జమిస్తాపూర్ తదితర గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు.



మిగతాది 2లో

# సంపాదకీయం

## వాట్ ఈజ్ దిస్ జస్టిస్?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు బయటపడ్డాయని వెలువడ్డ వార్త న్యాయ వ్యవస్థను ఉలికిపాటుకు గురిచేసింది. న్యాయవ్యవస్థ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వెలువడిన ఈ వార్తతో సదరు వ్యవస్థపై ప్రజలలో నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ ఉదంతంతో పలు మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోట్ల కట్టలు ఈ నెల 14న బయటపడగా, వారం రోజుల వరకు అది వెలుగు చూడకపోవడానికి కారణం ఏమిటి? ఆ నోటా ఈ నోటా ఈ ఉదంతం వెలుగులోకి రావడం ఏమిటి? సదరు న్యాయమూర్తిని కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం ఏమిటి? లెక్కల్లో చూపని నగదు దొరికినప్పుడు హడావిడి చేసే ఈడీ, ఆదాయపు పన్ను శాఖలు మౌనంగా ఉండటం ఏమిటి? ఈ సంఘటనపై సమాచారం సుప్రీంకోర్టు కొలీజియంకు నిజంగానే ఆలస్యంగా తెలిసిందా? లేక ఈ వ్యవహారం గాలివానగా మారడంతో విధిలేని పరిస్థితుల్లో సుప్రీంకోర్టు కొలీజియం స్పందించిందా? ఈ సంఘటనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అంతర్గత విచారణ చేపట్టగా 'అబ్బే, సదరు న్యాయమూర్తి ఇంట్లో డబ్బే దొరకలేదు' అని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రకటించడం ఏమిటి? ఇందులో నిజానిజాలు తెలుసుకొనే హక్కు ఈ దేశ పౌరులకు లేదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయా? అవినీతికి అతీతం కాదా?? మిగతా వ్యవస్థల వలే న్యాయ వ్యవస్థలో కూడా అవినీతి చోటుచేసుకుంటోందన్న విమర్శలు ఇటీవలి కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే, న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కారణంగా న్యాయమూర్తుల అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఉంది. కీలకమైన, సున్నితమైన అంశాలపై విచారణ జరిపి తీర్పులు ఇచ్చే హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రక్షణలు కల్పించారు. ఇప్పుడా రక్షణలను కొంతమంది న్యాయమూర్తులు దుర్వినియోగం చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. తీర్పులు అనుకూలంగా రాని సందర్భాలలో కక్షిదారులు న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించకుండా రాజ్యాంగ నిర్మాతలు ఈ రక్షణలు కల్పించారు. న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించే వారిని కోర్టు ధిక్కరణ కింద శిక్షించే వెసులుబాటును న్యాయ వ్యవస్థకు రాజ్యాంగం కల్పించింది. న్యాయమూర్తులకు కల్పించినంత రక్షణ న్యాయాధికారులకు కల్పించలేదు. కింది స్థాయి కోర్టులలో పనిచేసే న్యాయాధికారులు అవినీతికి పాల్పడినా లేదా ఇతర అనైతిక చర్యలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకొనే అవకాశం హైకోర్టులకు కల్పించారు. అదే హైకోర్టు న్యాయమూర్తి ఎవరైనా అవినీతికి పాల్పడ్డారని వెల్లడైనా సదరు న్యాయమూర్తిపై సుప్రీంకోర్టు కూడా నేరుగా చర్య తీసుకోలేదు.పార్లమెంటు ఉభయ సభల్లో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించడం ద్వారానే సదరు న్యాయమూర్తులను తొలగించగలరు. స్వతంత్ర భారతావనిలో రామస్వామి, సౌమిత్రసేన్ అనే ఇద్దరు న్యాయమూర్తులు మాత్రమే అభిశంసన ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు లభించిన విషయం వాస్తవమేనని రుజువైతే ఆయనపై ఏమి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశం అయింది. న్యాయాధికారులను అవినీతి కేసులలో అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఇనుప ఖనిజం గనుల వ్యవహారంలో గాలి జనార్దన్‌రెడ్డి అండ్ కో నుంచి ఐదు కోట్ల రూపాయలు లంచంగా తీసుకున్నారన్న ఆరోపణలపై పట్టాభి రామారావు అనే న్యాయాధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో సీబీఐ అధికారులు ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో అవమాన భారంతో కుంగిపోయిన పట్టాభి రామారావు కొంతకాలానికి ఆత్మహత్య చేసుకున్నారు. నిజమేనా? నిజమైతే ఏం చేస్తారు? ఇప్పుడు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ వ్యవహారం రచ్చగా మారింది. వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కొలీజియం నిర్ణయించడంతో, 'మా హైకోర్టు ఏమైనా చెత్త బుట్టా?' అని అలహాబాద్ హైకోర్టు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. దీంతో వర్మ బదిలీకి, ఆయనపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేపట్టిన అంతర్గత విచారణకూ సంబంధం లేదని సుప్రీంకోర్టు కొలీజియం వివరణ ఇచ్చింది. డబ్బు కట్టలు లభించిన విషయం నిజమా? కాదా? అని నిర్ధారించుకోవడానికి వారం రోజులు చాలవా? ఇంకెంత కాలం కావాలి? ఒకవేళ అది నిజం కాని పక్షంలో యశ్వంత్ వర్మ ప్రతిష్ఠకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత తీసుకుంటారు? అంతర్గత విచారణలో అది నిజమే అని తేలితే సదరు న్యాయమూర్తిపై ఏమి చర్యలు తీసుకుంటారు? వారం రోజులుగా ఈ వ్యవహారం గుప్పుమంటున్నా నోరు విప్పని ఢిల్లీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గర్గ్ ఇప్పుడు 'అబ్బే, అలాంటిదేమీ లేదు' అని ప్రకటించడమేమిటి? దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మౌనంగా ఎందుకుందో తెలియదు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల వద్ద లెక్కల్లో చూపని నగదు స్వల్ప మొత్తంలో దొరికినా అవినీతి నిరోధక సంస్థలు కేసులు పెడతాయి.లంచంగా వంద రూపాయలు తీసుకున్నప్పటికీ నేరం నేరమేనని ఉన్నత న్యాయస్థానాలు ఎన్నో సందర్భాలలో తీర్పులు ఇచ్చాయి. ఈ సూత్రం న్యాయమూర్తులకు వర్తించదా? రాజ్యాంగపరంగా రక్షణ కల్పించబడినప్పటికీ ఇలాంటి సందర్భాలలో సదరు న్యాయమూర్తులపై చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలకు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఎలా ఉంటుంది? న్యాయవ్యవస్థలోనూ జవాబుదారీతనం ఉండాలి కదా? కీలక ప్రశ్నలు... న్యాయ వ్యవస్థలో అవినీతి అనేది బహిరంగ రహస్యంగా మారిన ఈ రోజుల్లో న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలను కొనసాగించవలసిందేనా? ఇప్పటికే న్యాయమూర్తుల నియామకం ప్రక్రియ చర్చనీయాంశం అయింది. ఉన్నత న్యాయస్థానాలతోపాటు సర్వోన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులను నియమించే అధికారం కొలీజియం వద్ద ఉండటం వాంఛనీయం కాదన్న వాదన నడుస్తోంది. అలా అని న్యాయమూర్తుల నియామక అధికారం ప్రభుత్వాలకు అప్పగిస్తే న్యాయ వ్యవస్థ స్వతంత్రత దెబ్బతింటుందన్న వాదన కూడా బలంగా ఉంది. ఇటీవలి కాలంలో మన న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించడం లేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. దేశంలో బలమైన నాయకత్వం ఉన్నప్పుడల్లా న్యాయ వ్యవస్థ సాగిలపడిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో పాలకులు ఎంత శక్తిమంతులుగా ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడిన న్యాయమూర్తులను కూడా చూశాం. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు న్యాయ వ్యవస్థ లొంగిపోయిందని చెబుతారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు ఉండేవారు. కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పి.శివశంకర్ పనిచేశారు. అప్పట్లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ద్రోణంరాజు సత్యనారాయణ అనే కాంగ్రెస్ నాయకుడు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనం నెలల తరబడి విచారించింది. చివరికి ముఖ్యమంత్రి నివాసంలో పరిమితికి మించి పాలు వినియోగించడం వంటి అంశాలలో ఎన్టీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని ధర్మాసనం తేల్చింది.రెండు మూడు లీటర్ల పాలు ఎక్కువగా వినియోగించారని ఇప్పుడు తీర్పు ఇస్తే జనం నవ్వుకుంటారు. వందల, వేల కోట్ల అవినీతి జరిగినా, జరుగుతున్నా ప్రజల్లో స్పందన ఉండటం లేదు. ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా తీర్పు రావడానికి పై నుంచి వచ్చిన ఒత్తిళ్లు పనిచేశాయని అప్పట్లో ప్రచారం జరిగింది.

## ఆర్టీసీ బస్సు-కారు ఢీకొని ప్రమాదం.. ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

మొదటి పేజీ తరువాయి
ఆర్టీసీ బస్సు- కారు ఢీకొని దంపతులు, ఎనిమిదేళ్ల కుమార్తె ఘటనా స్థలంలోనే మృతి చెందగా.. తీవ్ర గాయాల పాలైన మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులను గడ్డం రవీందర్, రేణుక, రితిక(8)గా గుర్తించారు.

ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న కారు పరస్పరం ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. పెద్ద శబ్దం రావడంతో హుటాహుటిన స్థానికులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సు, కారు వేగంగా రావడం, మలుపు తీసుకొనే క్రమంలో కారు అదుపు తప్పి బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారు వెనుక భాగంలో కూర్చొన్న రేణుక, రితిక.. డ్రైవర్ పక్కన కూర్చొన్న రవీందర్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాలను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే, కారు వేగంగా రావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? బస్సు వేగంగా రావడం వల్లా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు కావడంతో విషాద ఛాయలు అలముకున్నాయి.

## నకిలీ పోలీసుల దారి దోపిడీ.. యువకుడిని నమ్మించి రూ.ఐదు లక్షలతో పరారీ!

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: సికింద్రాబాద్ సమీపంలోని బోయిన్‌పల్లిలో నకిలీ పోలీసులు దారి దోపిడీకి పాల్పడ్డారు. తనిఖీల పేరుతో పోలీసులమని నమ్మించి అరుణ్ అనే వ్యక్తి నుంచి రూ.5లక్షలు నగదు కాజేశారు. ఈ ఘటన శనివారం రాత్రి బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌లోని ఓ సంస్థలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న అరుణ్ కుమార్‌కు సికింద్రాబాద్ బ్రాంచ్ మేనేజర్ బిక్రమ్ బెహెరా.. సుచిత్రలో నివాసం ఉంటున్న అసిస్టెంట్ మేనేజర్ సత్య పాండాకు రూ.5 లక్షలు ఇచ్చేందుకు పంపాడు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఎంఎంఆర్ గార్డెన్ ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో అతడు బైక్‌పై వెళుతుండగా.. తనిఖీల పేరుతో పోలీసుల వేషధారణలో ఉన్న ఇద్దరు వ్యక్తులు అరుణ్ వాహనాన్ని ఆపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ అడిగారు.

వెంటనే అతడి బ్యాగును తనిఖీ చేయగా ఐదు లక్షల రూపాయలు ఉన్నట్లు గుర్తించి వాటి పత్రాలు అడిగారు. లేదంటే మీ యజమానిని తీసుకొని పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పి ఆ నగదుతో పరారయ్యారు. దీంతో వెంటనే సంస్థ మేనేజర్‌కు సమాచారం అందించిన అరుణ్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లడంతో.. వాళ్లు నకిలీ పోలీసులు అని తేలింది. మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కమ్యూనిస్టులంతా ఒకే ఎర్రజెండాగా మారాలి: సినీనటుడు అజయ్ ఘోష్

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ అధికారంలోకి వస్తున్నాయి.. కానీ, భారత్‌లో పుట్టిన కమ్యూనిస్టు పార్టీ మాత్రం అధికారంలోకి రావడంలేదని ప్రముఖ సినీనటుడు అజయ్ ఘోష్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ యువజన ఉత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీల పెద్దలు ఒక మెట్టు దిగాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టు పార్టీల నేతలు కలవకపోతే దేశాన్ని ఎవరూ కాపాడలేరన్నారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఒకే ఎర్రజెండాగా మారాలని ఈ సందర్భంగా అజయ్ ఘోష్ ఆకాంక్షించారు.

## ఓయూలో రోడ్డుపై బైఠాయించి విద్యార్థినుల నిరసన



హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించారు. సెంటినరీ లేడీస్ హాస్టల్‌లో నీళ్లు రావడంలేదంటూ నిరసనకు దిగారు. గత మూడు రోజులుగా హాస్టల్‌లో ఇబ్బందిగా ఉందని.. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. వేసవి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న సెంటినరీ హాస్టల్ డైరెక్టర్ కల్యాణ లక్ష్మి, సూపరింటెండెంట్ పద్మ అక్కడికి చేరుకొని విద్యార్థినులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని.. విద్యార్థినులు ధర్నా విరమించుకోవాలని సూచించారు.

## కేసీఆరే మళ్లీ వస్తే బాగుంటుందని రైతులు కోరుకొంటున్నారు: కేటీఆర్




కరీంనగర్: కాంగ్రెస్‌కు ఓటేసి తప్పుచేశామని రాష్ట్ర ప్రజలంతా బాధపడుతున్నారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేసీఆరే మళ్లీ వస్తే బాగుంటుందని రైతులు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాల కోసం కరీంనగర్‌లో నిర్వహించిన సన్నాహక సభలో కేటీఆర్ మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. భాజపా, కాంగ్రెస్ రెండూ ఒక్కటేనన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ మోసం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణవాదం ఎక్కడుందని వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంటే.. రాజీనామా చేసిన కేసీఆర్‌ను గెలిచిపించి చూపించింది కరీంనగర్‌వాసులేనని గుర్తు చేశారు. భారాస, కేసీఆర్ కుటుంబంపై అసూయ, ద్వేషంతో దుష్ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ దుయ్యబట్టారు.

### హుటాహుటిన దిల్లీకి కేంద్రమంత్రి

## కిషన్ రెడ్డి పయనం

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హుటాహుటిన దిల్లీకి పయనమయ్యారు. తన షెడ్యూల్ ప్రోగ్రామ్ రద్దు చేసుకొని మరీ హస్తిన బయల్దేరి వెళ్లారు. హఠాత్తుగా కిషన్ రెడ్డి దిల్లీకి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

అంతకుముందు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన కిషన్ రెడ్డి నిన్న చెన్నైలో డీలిమిటేషన్‌పై జరిగిన సదస్సుపై స్పందించారు. ఆ సదస్సుతో కాంగ్రెస్, భారాస పాత బంధం బయటపడిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్, భారాస అసత్య ప్రచారం చేస్తున్నాయంటూ మండిపడ్డారు. డీలిమిటేషన్‌పై కేంద్ర ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్న ఆయన.. స్టాలిన్ ప్రభుత్వం పట్ల తమిళనాడు ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నందునే డీలిమిటేషన్, భాష పేరుతో ఆయన ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## పోరాటాల పురిటిగడ్డ ఈ కరీంనగర్ గడ్డ

మొదటి పేజీ తరువాయి
కరీంనగర్ నుంచి ఏ పని మొదలుపెట్టినా విజయవంతం అయితదని, అందుకే పార్టీ కార్యకర్తల తొలి సమావేశాన్ని కూడా కరీంనగర్‌లోనే పెట్టామని చెప్పారు. నాడు 'తెలంగాణ ఉద్యమం ఏడున్నది..? వైఎస్ సంక్షేమ పథకాల గాలిలో కొట్టుకుపోయింది' అని అప్పటి పీసీసీ అధ్యక్షుడు పిచ్చి ప్రేలాపనలు చేస్తే.. కేసీఆర్ ఉద్యమ ఊపు చూపించడానికి కరీంనగర్‌లో తన ఎంపీ పదవికి రాజీనామా చేసి మళ్లీ బరిలో దిగారని గుర్తుచేశారు. అప్పుడు కేసీఆర్‌ను ఏకంగా 2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించి కరీంనగర్ దమ్మేందో చూపెట్టిన గడ్డ కరీంనగర్ గడ్డ అని కొనియాడారు. పోరాటాల పురిటిగడ్డ ఈ కరీంనగర్ గడ్డ అని ప్రశంసలు కురిపించారు.

బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రత్యేకమైన పార్టీ అని, ఈ దేశంలో ఎన్నో పార్టీలు పుట్టినయ్.. మాయమైపోయినయ్.. అని, ఉద్యమ పార్టీగా పుట్టి పదేళ్లు అధికార పార్టీగా వెలుగొందిన పార్టీ అని కేటీఆర్ చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల తలరాతలు మార్చిందని అన్నారు. గత 16 నెలల నుంచి అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తూ ప్రతిపక్ష పార్టీ అంటే ఎట్లుండాల్నో చాటిచెబుతోందని చెప్పారు. మన పార్టీ పుట్టింది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనే ఒకే ఒక్క లక్ష్యంతోనని, 25 ఏళ్ల క్రితం 2001 ఏప్రిల్ 27న పెద్దలు కేసీఆర్ గారి నాయకత్వంలో జయశంకర్ గారి లాంటి ఎంతో మంది మహానుభావుల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ పురుడుపోసుకున్నదని గుర్తుచేశారు.

## బండి సంజయ్‌కి అదొక్కటే తెలుసు.. ఇంకేం తెల్వదు

మొదటి పేజీ తరువాయి
బండి సంజయ్‌ని తెలంగాణకు ఏం జేసింద్రని అడిగితే ఏం జెప్తడు. ఏం జెప్పడు. ఎందుకంటే ఆయనకు ఏ తెల్వదు. ఆయనకు ఒక్కటే తెలుసు. ఏందది మసీదు కూలగొడ్దాం. అండ్ల శవం దొరికితే మీది, శివం దొరికితే మాది అంటడు. అదొక్కటే తెలుసాయనకు. లేదంటే అన్నా ఇయ్యాలేం వారమే, రేపేం వారేమే, ఎల్లుండే వారమే అని అడుగుతడు. అంతే తప్ప వాళ్లు ఓ బడి తెచ్చింది లేదు, ఓ గుడి కట్టింది లేదు' అని కేటీఆర్ విమర్శించారు.

'ఒక ఓటు ద్వారా తప్పుడు పాలకులను ఎన్నుకున్నందుకు ఐదేళ్ల శిక్ష పడింది. ఇగనైనా మనం మేలుకోవాలి. మంచి పాలకులను ఎన్నుకోవాలె. బీఆర్ఎస్‌ను ఓడగొట్టడానికి కాంగ్రెస్ పార్టీ అసూయ, ద్వేషం, ఆశ అనే మూడు ప్రయోగాలు చేసింది. స్థానిక నాయకత్వం మీద అసూయ నింపింద్రు. కేసీఆర్ మీద ద్వేషం పెంచింద్రు. ఓటర్లకు తులం బంగారం, రూ.15 వేల రైతుబంధు, పెన్షన్‌ల రెట్టింపు అని ఆశ పెట్టింద్రు. వాళ్ల ప్రయోగాలు ప్రజలపై పనిచేయడంలో ప్రజల తప్పు లేదు. మన తప్పే ఉంది. కేసీఆర్ ప్రజలకు చెప్పమన్నది మనం సరిగ్గా చెప్పుకోలేకపోయినం.' అని అన్నారు.

'కేసీఆర్ హయాంలో దినదినాభివృద్ధి చెందిన తెలంగాణ ఇవాళ కాంగ్రెస్ పాలనలో ఆగమైతున్నది. తెలంగాణను కాపాడుకోవాలంటే మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలె. ఏప్రిల్ 27 తర్వాత కొత్తగా మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రారంభించుకుందాం. కమిటీలను నిర్మించుకుందాం. కమిటీల్లో ప్రజల మధ్య ఉండే నాయకులకు చోటు కల్పిద్దాం. ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ ఎట్ల అన్యాయం చేసినయో వివరించేలా మన నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలె. అందుకోసం అన్ని జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు పెట్టుకుందాం. ఒకవేళ రేవంత్‌రెడ్డికి బుద్ధొచ్చి స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తం. ఈ సారి కరీంనగర్‌లోని 13 స్థానాల్లో గులాబీ జెండా ఎగిరేలా పనిచేద్దాం. పార్టీకి టికెట్ ఇచ్చిన అభ్యర్థి వెంటే క్యాడర్ నడువాలి. వ్యక్తిగత కక్షలకుపోతే అవతలి అభ్యర్థికి లబ్ధి జరుగుతది. 2028లో కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేద్దామని శపథం చేద్దాం.' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 40 వేలు అందించాలి

మొదటి పేజీ తరువాయి
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగం దిక్కుతోచని పరిస్థితిలో ఉందని, తిండి తిప్పలు లేకుండా నాటు పెట్టుకున్న రైతులకు కోత దశలో ఉండగా వడగండ్ల పంటలను దెబ్బతీసిందని తెలిపారు. వాన పంటలు నష్టపోతే అధికారులు ఎవరూ గ్రామానికి రాలేదని రాలేదు, కనీసం రైతులను ఓదార్చలేదని ఆరోపించారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని, ప్రతి ఎకరాకు రూ. 40 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలి. తక్షణ సహాయం కింద రూ . 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన మహిళా రైతు జ్యోతికి ఆయన ఆర్థిక సహాయం అందించారు కేసీఆర్.. కేటీఆర్ దృష్టికి తీసుకెళతాం ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని, సమస్యను కేసీఆర్ , కేటీఆర్ దృష్టికి తీసుకెళతానని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాయమాటలతో రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. రైతులకు ఇంతవరకు రైతు భరోసా రాలేదని, రుణమాఫీ చేయలేదని పేర్కొన్నారు.ఆయన వెంటే మాజీ మంత్రి గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మహబూబ్‌నగర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, శ్రీనివాసులు, రాజగోపాల్ యాదవ్, బొక్కలోనిపల్లి మాజీ ఉప సర్పంచ్ అశోక్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతయ్య యాదవ్, బొక్కలోనిపల్లి పార్టీ అధ్యక్షులు తిరుపతయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెన్నయ్య యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మారుతి గౌడ్, నాగులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం మార్చి 24 2025

# యువత 'రాజీవ్ యువ వికాస' పథకాన్ని వినియోగించుకోవాలి.

**– కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంపతి ఉదయ్ కుమార్.**



**కరపత్రం గన్నేరువరం మార్చి 23**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకాన్ని యువతి, యువకులు వినియోగించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంపతి ఉదయ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తుందని, 3లక్షల వరకు ఆర్థిక సహాయం ఆయా కార్పొరేషన్ల ద్వారా అమలు జరుగుతుందని. ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి ద్వారా యువతి, యువకులు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకునేందుకు యువతకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా ఈ పథకం అమలు జరుగుతుంది. మార్చి 17న రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని ఆర్థిక సాయం కోసం యువతీ, యువకులు చేసుకున్న దరఖాస్తులను ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు పరిశీలించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ప్రకటించడం జరుగుతుందన్నారు. మండలంలోని యువతి యువకులు, ఉద్యోగ ఉపాధి ఆర్థికంగావారిని ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి , మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ 148 కళ్యాణ లక్ష్మి, 23 షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. రామగుండం నియోజకవర్గం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనలతో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎక్కడ కూడా వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు నమ్మి ఓటేసిన పాపానికి నయవంచన చేసింది కాంగ్రెస్ సర్కార్.

**– కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.**

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**



రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడంతో నమ్మి ఓటేసిన పాపానికి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచను చేసిందని ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్అన్నారు.అసెంబ్లీ సాక్షిగా రుణమాఫీ పై చేతులెత్తేసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని దారుణంగా మోసం చేసిందని తెలియజేశారు.వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటనతో రుమాఫీ కథ ముగించే కుట్ర చేస్తున్నారని స్పష్టమవుతున్నదని కోరుట్ల ఎమ్మెల్యే అన్నారు.ముఖ్యమంత్రి మాటలు విని రెండు లక్షల పైన రుణంఉన్నరైతులుఅప్పు చేసి, మిత్తి తో సహా బ్యాంకులకు కట్టారని తెలిపారు . రైతులుతమకు రుణమాఫీ ఎప్పుడు అవుతుందనిఆశగాఎదురుచూస్తున్నారని, బ్యాంకుల చుట్టూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుంతున్నారని ప్రభుత్వానికి గుర్తు చేశారు.రెండు లక్షల లోపు రుణ మాఫీ కాని వారి పరిస్థితి, రెండు లక్షల పైన రుణం ఉండి మాఫీ కాని రైతుల పరిస్థితిఏమిటని ప్రభుత్వాన్నిప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంనమ్మి ఓటేసిన పాపానికి నయవంచన చేసింద ని కోరుట్ల ఎమ్మెల్యే అన్నారు.ఇలాంటి అసంబద్ధ ప్రకటన పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యావత్తెలంగాణప్రజలకు, రైతులకుక్షమాపణలుచెప్పాలనిబి ఆర్ ఎస్ పక్షానడిమాండ్చేస్తున్నానని ఎమ్మెల్యేసంజయ్అన్నారు.ఇచ్చిన మాటకుకట్టుబడిరైతులందరికీ రుణమాఫీ చేసి తీరాలనిడిమాండ్చేశారు..రైతులనుదారణంగామోసంచేసినకాంగ్రెస్పార్టీని రేవంత్ రెడ్డి ని ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ నిలదీస్తూనేఉంటుంది. అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యాన్నిఎండగడుతూనే ఉంటుంది.రుణమాఫీ హామీ అమలును ప్రణాళిక ప్రకారం అటకెక్కించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారనికోరుట్లఎమ్మెల్యే కల్వకుంట్లసంజయ్అన్నారు.

# ఘనంగా భగత్ సింగ్ 94వ వర్ధంతి




**– భగత్ సింగ్ జయంతి వర్ధంతిని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి**
**– ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 23**

హుజూరాబాద్ పట్టణ కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వేంకటేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి ప్రాణాలను అర్పించిన మహనీయులు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో యువత నడుచుకుని, ఆయన ఆశించిన నవభారతావని కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ కు భారతరత్న బిరుదునివ్వడంతో పాటు హైదరాబాద్ లోని ట్యాంకుబండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మాటి వేణుగోపాల్,రాంపెల్లి రోహిత్, నాయకులు వంశీ, రాజు, మణి, అజేయ్ తదితరులు పాల్గొన్నారు..

# భగత్ సింగ్,రాజు సుఖదేవుల 94వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన యువత...

**– కుల ,మత తత్వ రాజకీయాలలో నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే.**
**– పి వై ఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేష్.**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**




పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రం లోని ఏక్లాస్ పూర్ గ్రామంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజు గురు శిఖదేవుల 94వ వర్ధంతి సందర్భంగా యువత ప్రజలు పిడిఎస్ యూ,పివైఎల్ ,సీపీఐ ఎంఎల్ మాస్ ప్రజా పంథా ఆధ్వర్యంలో సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమేష్,ఉపాధ్యక్షులు కొట్టే తిరుపతి ఏక్లాస్ పూర్ గ్రామంలో జరిగిన సభలో జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, డివిజన్ నాయకులు తీగుట్ల రాములు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం రావాలని బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన యువ కిశోరాలు కామ్రేడ్ భగత్ సింగ్, రాజగురు సుఖదేవులు చిన్న వయసులోనే దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించారు.దేశాన్ని దోచుకుంటూ భారతీయుల బానిసగా చేస్తున్న బ్రిటిష్ అసెంబ్లీ పైన బాంబు వేసిన ఘనత వారికి ఉంది అన్నారు.బ్రిటిష్ వాళ్లు ఉరిశిక్ష విధిస్తే నవ్వుతూ స్వీకరించారు.అలగే 23 సంవత్సరాల వయసులోనే ఉరికంబాన్ని నవ్వుతూ ముద్దాడారు, మా మరణం తోటైనా ఈ దేశంలో ఉన్న ప్రజలు మేలుకొని దేశ స్వాతంత్రం కోసం పోరాడుతారని తెగించి ఉరి తాళ్ల నువ్వు ఉయ్యాలలో ఊగరు అని అన్నారు.నేడు భారతదేశంలో ఏ పాలకులైన హామీలు ఇస్తూ అమాయకపు ప్రజలను మోసం చేస్తూ కార్పొరేట్ వ్యవస్థకు ఉన్న ప్రభుత్వ సంస్థలు తాకట్టుపెట్టి విదేశాలకు ఊడిగం చేస్తున్నారు. భారతదేశంలో ఉన్న యువతను ఉద్యోగాలు లేక పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. అవినీతి రాజకీయాలు మతతత్వ ,కుల విద్వేషణ రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారు. ఇది దేశానికి తీవ్ర ప్రమాదం దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత యువత పైన ఉంది అన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోతుంది. దేశంలో ఉన్న ఆస్తులు కేవలం మూడు శాతం వ్యాపారుల వద్ద 80 శాతం సంపద ఉంది అన్నారు.80శాతం ప్రజల వద్ద కేవలం 20 శాతం కూడా సంపద లేదు ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రస్థాయికి పెరిగిపోతుంది అన్నారు.పాలకులు ఇచ్చిన వాగ్దానాలు చేస్తున్న రాజకీయాలను గమనించి యువత పోరాటం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.యువత సామ్రాజ్యవాద పద్ధతి నుండి మత్తు పదార్థాలకు దూరం ఉండి ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ పైన ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ విద్యార్థి నాయకులు విష్ణువర్ధన్ రాజు, వెంకటేష్ ,కుమారు, నిఖిల్ సాయి, పి వై ఎల్ నాయకులు స్వామి రాజయ్య ,లింగయ్య, రాజయ్య ,శంకర్ ,రమేష్, తిరుపతి ,శ్రావణ్, కార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.

# చిరుప్రాయములోనే ఛిద్రం అవుతున్న బాల్యం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 23**

**హుజురాబాద్ నియోజకవర్గం-జమ్మికుంట పట్టణం....**



చిరుప్రాయములోనే ఛిద్రం అవుతున్న బాల్యంలిఉజ్వల భవిష్యత్ ఉన్న బాలలు 18సం. రాలు నిండకుండానే వారి ఇష్టానుసారం రోడ్లపై మోటార్ సైకిల్ నడుపుతూ ప్రమాధాలకు కారకులవ్వుతూ, వారు అర్ధర్తరంగా తనువు చాలీస్తు, కన్నవారికి పుత్రశోకము మిగులుస్తున్నారు. అంగవైకల్యము తెచ్చుకుంటున్నారు. దీనికి తల్లిదండ్రులు,గురువులు, మేధావులు అందరు కూడా చోరువ తీసుకోవాలి, మైనారిటి తీరక ముందు తల్లిదండ్రులు పిల్లలకు బైకు లు ఇవ్వరాదు, ఒక వేళ బైకు ఇచ్చినట్లు అయితే వారి మీద కూడా కేసులు నమోదు చేయాలి. మొన్ననే మన కళ్ళముందే మైనర్ బాలుడైనా అనుదీప్ మరణం జీర్ణించుకోలేము. దయముయులైన సమాజ సేవకులారా, భాద్యత గల పోలీసు అధికారులు, హుజురాబాద్ యం. వి. ఐ గారలు మీ వీలును బట్టి మైనర్ డ్రైవింగ్ పైన, కలిగే నష్టలపైన అవగాహన కార్యక్రమాలు నిర్యహించాలని, బైక్ డ్రైవింగ్ కు ఉండాల్సిన వయస్సు, అర్హతలు, శిక్షల గురించి తెలియజేయాలని, మా వంతు భాద్యతను మేము కూడా మీతో పాలు పంచుకుంటామని, భవిష్యత్ తరాలకు యువత యొక్క పాత్ర, భాద్యత ఎంతో విలువైంది కావున రోడ్ ప్రమాదాల నివారణ మనందరి భాద్యత అందరం పోలీసు, యం. వి.ఐ. పాఠశాల యజమాన్యాలు మరి ముఖ్యంగా పిల్లల తల్లిదండ్రులు మైనర్ బైక్ డ్రైవింగ్ ను ప్రోత్సాహించవద్దని, నష్టం జరిగిన తర్వాత చేసేది ఏమి ఉండదని, నష్టం జరుగకుండా జగరాతతో ఆలోచించాలని, మైనర్ బైక్ నడుపుతూ కనపడితే, బైక్ సీజ్ చేస్తూ, నడిపిన పిల్లవాడి పై అతని తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేయాలని, కఠినంగా వ్యవహారిస్తే తప్ప మార్పు సాధ్యం అయ్యేటట్లు లేదు కనుక మనందరం కలిసి బాధ్యతగా మైనర్ బైక్ డ్రైవింగ్ ను అరికట్టెందుకు కనకనబద్దులము అవుదామని కోరుతున్నాము.

# రసమయిపై సీపీకి సురక్షా, అంకిత్ ఆస్పత్రి ఎండీల ఫిర్యాదు..

**కరపత్రం శంకరపట్నం మార్చి 23**

మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ తమ ఆసుపత్రులపై నిరాదరమైన ఆరోపణలు చేసినట్లు, కరీంనగర్ సిపి కి ప్రసన్న ఫిర్యాదు చేసినట్లు హాస్పిటల్ ఎండి లు, డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, ఆదివారం తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ అనురాధ మాట్లాడారు.తమ ఆసుపత్రులపై నిరాధారమైన ఆరోపణలు చేసిన మాజీ ప్రజాప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ నేత రసమయి బాలకిషన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భూపాలపల్లి, జమ్మికుంట సురక్షా ఆస్పత్రుల ఎండి హరి ప్రసాద్ రెడ్డి, అంకిత్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఈ నెల 16న తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జమ్మికుంట, భూపాలపల్లి ప్రాంతాల్లోని సురక్షా హాస్పిటల్, హైదరాబాద్‌లోని అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌పై రసమయి తప్పుడు ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. మా ఆస్పత్రుల పై ఎలాంటి నిర్ధారిత ఆధారాలు లేకుండానే, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అక్రమంగా ఎల్.ఓ.సీలు ఇప్పించి ఆర్థిక ప్రయోజనం పొందేలా చేసినట్టు అభియోగాలు మోపారని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిమ్స్ కు మాత్రమే ఎల్ఓసీలు మంజూరు చేస్తోందని, ఏ ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు ఎల్ఓసీలు ఇవ్వడం లేదని, సురక్షా హాస్పిటల్, అంకిత్ హాస్పిటల్ లో ఎల్ఓసీ కింద ఏ ఒక్క రోగికి కూడా చికిత్సలు అందించడం జరగలేదని,ప్రభుత్వ ఖజానా నుంచి ఎల్.ఓ.సీ ద్వారా మా ఆస్పత్రులు ఎలాంటి డబ్బులు తీసుకోవడం జరగలేదని వివరించారు.వాస్తవాలు ఇలా ఉండగా, రసమయి బాలకిషన్ మా ఆస్పత్రులపై ఉద్దేశపూర్వకం గా తప్పుడు ఆరోపణలు చేసి, మా ఆస్పత్రుల ప్రతిష్టను దిగజార్చారని, ఆవేదన వ్యక్తం చేశారు.

# కుల,మత రాజకీయాలలో నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువత దే:

**– భగత్ సింగ్,రాజ్ గురు సుఖదేవులు లను ఆదర్శంగా తీసుకొని యువత పోరాడాలి:**

**– 94వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన యువత:**

**– పి వై ఎల్, పిడిఎస్యు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా:**

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి





కుల,మత రాజకీయాలలో నుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువత దే అని,భగత్ సింగ్,రాజ్ గురు సుఖదేవులు లను ఆదర్శంగా తీసుకొని యువత పోరాడాలనీ, పి వై ఎల్,జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమేష్,సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న లు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక అంతర్గాం మండల కేంద్రం లో, ఏక్లాస్ పూర్ గ్రామంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవుల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం యువత, ప్రజలు, పిడిఎస్ యూ ,పివైఎల్ సీపీఐ ఎంఎల్ మాస్ ప్రజా పంథా ఆధ్వర్యంలో సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి వై యల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల రమేష్,ఉపాధ్యక్షులు కొట్టే తిరుపతి లు మీటింగ్ లో మాట్లాడారు.ఏక్లాస్ పూర్ గ్రామంలో జరిగిన సభలో జిల్లా నాయకులు గుమ్మడి వెంకన్న, డివిజన్ నాయకులు తీగుట్ల రాములు మాట్లాడారు.దేశానికి స్వాతంత్రం రావాలని, బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన యువ కిశోరాలు కామ్రేడ్ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవులు అని,చిన్న వయసులోనే దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించారనీ , దేశాన్ని దోచుకుంటూ భారతీయుల బానిసరిగా చేస్తున్న బ్రిటిష్ అసెంబ్లీ పైన బాంబు వేసిన ఘనత వారికి ఉందనీ అన్నారు.బ్రిటిష్ వాళ్లు ఉరిశిక్ష విధిస్తే నవ్వుతూ స్వీకరించారనీ,23 సంవత్సరాల వయసులోనే ఉరికంబాన్ని నవ్వుతూ ముద్దాడారనీ,మా మరణం తోటైనా ఈ దేశంలో ఉన్న ప్రజలు మేలుకొని దేశ స్వాతంత్రం కోసం పోరాడుతారని ,తెగించి ఊరి కొయ్యాలలో ఉయ్యాల ఊగారని అన్నారు.నేడు భారతదేశంలో ఏ పాలకులైన హామీలిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తూ ,కార్పొరేట్ వ్యవస్థకు... ఉన్న ప్రభుత్వ సంస్థలు తాకట్టుపెట్టి విదేశాలకు ఊడిగం చేస్తున్నారనీ,భారతదేశంలో ఉన్న యువతను ఉద్యోగాలు లేక పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారనీ,అవినీతి రాజకీయాలు మతతత్వ, కుల , విద్వేషణ రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారనీ, ఇది దేశానికి తీవ్ర ప్రమాదమని, దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత యువత పైన ఉందనీ అన్నారు.దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోతుందని,దేశంలో ఉన్న ఆస్తులు కేవలం మూడు శాతం వ్యాపారుల వద్ద 80 శాతం సంపద ఉందని అన్నారు.80శాతం ప్రజల వద్ద కేవలం 20 శాతం కూడా సంపద లేదని ,ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రస్థాయికి పెరిగిపోతుందని అన్నారు.పాలకులు ఇచ్చిన వాగ్దానాలు చేస్తున్న రాజకీయాలను గమనించి యువత పోరాటం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.యువత సామ్రాజ్యవాద కల్చర్ నుండి మత్తు పదార్థాలకు దూరం ఉండి ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువత పైన ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు విద్యార్థి నాయకులు విష్ణువర్ధన్ ,రాజు ,వెంకటేష్, కుమారు ,నిఖిల్ ,సాయి, పి వై ఎల్ నాయకులు స్వామి, రాజయ్య, లింగయ్య, రాజయ్య ,శంకర్, రమేష్, తిరుపతి, శ్రావణ్, కార్యకర్తలు ,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక పూజలు...

కరపత్రం శంకరపట్నం మార్చి 23





పెద్దమ్మతల్లికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కమ్మపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, తిమ్మాపూర్ మండల కేంద్రంలో జరుగుతున్న పెద్దమ్మతల్లి బోనాల జాతరలో ఆదివారం మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుధగోని లక్ష్మీనారాయణ, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, కుంట రాజేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, నందగిరి రవీంద్ర చారి, కాలువ మల్లేశం, కొత్త తిరుపతిరెడ్డి, కొండలరావు,బుదారపు శ్రీనివాస్, పోలు రాము, ఎల్లారెడ్డి, రమేష్, తమ్మన వేణి రమేష్ కుమార్ యాదవ్, బండారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి నది తీర ప్రాంతంలో రూ.3 కోట్ల విలువైన పనులు ప్రారంభం

కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి



సింగరేణి రామగుండం ఏరియా-1 అద్వర్యంలో గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ గుడి వద్ద ఈకో పార్కు, రోడ్లు, షేడ్స్, టాయిలెట్స్, సైడ్ వాల్సు, స్నాన ఘట్టాలు, పుష్కర ఘాట్ తదితర మాలిక వసతులను సింగరేణి ద్వారా సుమారు రూ.3 కోట్ల విలువైన పనులను ప్రారంభించారు. రూ.98 లక్షలతో జీడికే ఓసి 5 పక్కన ఉన్న కబురస్తాన్ లో పలు మౌలిక సదుపాయాల పనులను ఆదివారం రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం ఏరియా 1 జిఎం డి.లలిత్ కుమార్ చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ సింగరేణి ద్వారా ఇటీవల సుమారు రూ.15 కోట్లతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం జరిగిందనీ, రోడ్ల విస్తరణ పనులు, పలు రకాల అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేసే విధంగా ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడ లేనివిధంగా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్, సింగరేణి ద్వారా అనేక అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. తెలంగాణలోనె ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ జాతర వచ్చే సంవత్సరం ఉన్నందున మన గోదావరి నది తీరంలో ఉన్న సమ్మక్క సారలమ్మ గుడిని ఒక పర్యాటక ప్రాంతంగా చేసేలా సింగరేణి ద్వారా పలు రకాల అభివృద్ధి పనులను ప్రారంభించటం జరిగిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఏడాది నిర్వహించు జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంకాళీ స్వామీ, పెద్దేల్లి ప్రకాష్, పొలసాని శ్రీనివాస్, అధికారులు ఎస్ఒటు జిఎం గోపాల్ సింగ్, డిజీఎం పర్సనల్ కిరణ్ బాబు, జితేందర్ సింగ్, వర ప్రసాద్, వసంత కుమార్, కుమారస్వామి, రాజు, దుర్గ ప్రసాద్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు...

**– ఎస్సై కొత్తపల్లి రవి...**

కరపత్రం శంకరపట్నం మార్చి 23



జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడారు. కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారిపై, మరికొన్ని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# శంకరపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా రమేష్...





**– ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్... – జిల్లా ఈసీ మెంబర్ స్వామి...**

కరపత్రం శంకరపట్నం మార్చి 23

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఐజేయు శంకరపట్నం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా జక్కోజు రమేష్ ఏకగ్రీవంగా నియామకమైన జిల్లా ఈసీ మెంబర్ గాజుల స్వామి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ ఆదేశం మేరకు మొలంగూర్ శివారులోని శ్రీ లక్ష్మీ ప్రసన్న గార్డెన్స్ లో నిర్వహించడం జరిగిందని, ఈ ఎన్నికల్లో మండల జర్నలిస్టుల సమావేశం నిర్వహించి, అధ్యక్షులుగా జక్కోజు రమేష్, ప్రధాన కార్యదర్శిగా మాతంగి శ్రీనివాస్, కోశాధికారిగా మోతే సదానందం, సలహాదారునిగా బుర్ల రాజు, ఉపాధ్యక్షులుగా దామెర సతీష్, బుర్ర సత్యనారాయణ, గొట్టి అర్జున్, సహాయ కార్యదర్శిగా దేవునూరి రవీందర్, నియామకం చేసినట్లు స్వామి తెలిపారు. ఈ సమావేశంలో మండల జర్నలిస్టులు, కొరిమి సంతోష్, కాశీపాక సంపత్, తిరుపతి రెడ్డి, దేవునూరి అంకుష్, మేడిశెట్టి భూమయ్య, తదితరులు పాల్గొన్నారు

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

**– సిపిఎం జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్**



కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 23

జమ్మికుంట సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 94 వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఈ సందర్భంగా జమ్మికుంట మండల కార్యదర్శి శీలం అశోక్ మాట్లాడుతూ... బ్రిటిష్ వలసవాద నిరంకుశ పాలన నుండి భారతదేశ ద్రస్య శృంఖలాల విముక్తి కోసం పోరాడిన యోధుడు ఉరి శిక్షను సైతం ఇష్టంగా స్వీకరించినటువంటి పోరాట యోధుడు భగత్ సింగ్ అతి చిన్న వయస్సులో 24 సంవత్సరాల్లో ఉరి తీయబడినటువంటి వ్యక్తి భగత్ సింగ్ బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ అసెంబ్లీలో బాంబు పెట్టారని అభియోగంతో అరెస్టు చేసి జైల్లో వేసినారు అయినప్పటికీ జైల్లో నుండి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన వ్యక్తి భగత్ సింగ్ గారు 1931 మార్చి 23వ తేదీన భగత్ సింగ్ తో పాటు సుగ్దేవ్ రాజ్ గురు లను కూడా ఈరోజే బ్రిటిష్ ప్రభుత్వము రహస్యంగా ఉరి తీయబడినటువంటి చీకటి రోజు బ్రిటిష్ ప్రభుత్వము వీరిని ఒకరోజు ముందే ప్రత్యేక జడ్జిని నియమించి ప్రజలు తిరగబడతారని రహస్య ప్రాంతంలో వారిని ఉరి తీయబడటం జరిగింది భగత్ సింగ్ కుటుంబ సభ్యులు క్షమాభిక్ష కొరకు భగత్ సింగ్ ని కలిసి క్షమాభిక్ష కొరకు సంతకం చేయమంటే వారు పెట్టే క్షమాభిక్షతో బతుకుడు నాకిష్టం లేదని ఉరికంబాన్ని సైతం ఇష్టంగా స్వీకరించినటువంటి వ్యక్తి భగత్ సింగ్ గ వారి స్ఫూర్తితో వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ వారి పోరాటపటిమను స్మరిస్తూ వారికి జమ్మికుంట మండల కమిటీ పక్షాన ప్రత్యేక విప్లవ జోహార్లు తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్ కుమార్ జక్కుల రమేష్ సతీష్ గిరవేణి రాజు సదానందం కిరణ్ రాజేష్ కుమార్ పాటు తదితరులు పాల్గొన్నారు

# అన్నార్తులకు 1430 రోజులుగా అన్నదాన కార్యక్రమాలు

**– మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్**

**– పేదలకు అన్నదానంతో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ**

కరపత్రం ప్రతినిధి వేములవాడ మార్చి 23

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1430 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజున లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమంతో పాటు వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా చింతపంటి శ్రీనివాస్ లక్ష్మి దంపతులు, జువ్వాడి స్నేహలత వెంక టేశ్వరరావు దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాల చందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలను కునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించా లని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, వొడ్యాల వేణు, పాత సంతోష్, ప్రతాప నటరాజు, పసుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



